# దక్షిణాది శాస్త్రులు

శ్రీ వేంకటరత్నదీక్షితులుగారు మంచి కర్మిష్ఠి; సంపన్న గృహస్థు. ఆ గ్రామానికి అగ్రగణ్యులు. అక్షరాలా వారిల్లు మొట్టమొదటే వుంది!

పూర్వం ఆధానం చేస్తేనే దీక్షితులు; సోమయాగం చేస్తేనే సోమయాజులు. ఏదో శాస్త్రం క్షుణ్ణంగా చదివితేనే శాస్త్రి. ఈనాడు అవి చాలా పేర్ల చివర ఊగులాడే సార్థక ప్రత్యయాలు.

పైవారు అక్షరాలా ఆధానంచేసిన దీక్షితులు. భార్య జీవించి వున్నంతకాలం నిరతాగ్నిహోత్రం చేసిన నిత్య కర్మిష్ఠులు ఆయన.

భార్యా వియోగానంతరం ఇంటికి సమీపంలోనే సొంత కొబ్బరి తోటలో ఆశ్రమం కల్పించుకుని నిత్య తపస్సంపత్తిలో తరచు అక్కడే వుండేవారు.

కొబ్బరాకులతో చిక్కగా నేసిన గది; చుట్టూ వసారా. ఆ వసారా చుట్టూ ఏవో పూలమొక్కలూ, నిమ్మగడ్డీ వగైరా వుండేవి.

బ్రాహ్మముహూర్తంలో కౌశికీ స్నానం, మధ్యాహ్నందాకా అనుష్ఠానం.

పెద్ద పాత భవంతి. దానిముందు పెద్ద గచ్చుచావడి, దాని వెనుక కటకటాల గది. దాని బీరువాల్లో ఎన్నో సంప్రదాయ గ్రంథాలూ, ధర్మశాస్త్ర గ్రంథాలూను.

దానిని ఆనుకుని ఒక చిత్రాసనంమీద కూర్చుని వ్యాసపీఠంమీద ఏ ధర్మసింధువో, నిర్ణయసింధువో చూస్తూ కాలక్షేపం చేసేవారు. ఎర్రగన్నేరు పువ్వు గంగు నీరు కావిబట్టలు ధరించి యెప్పుడూ "మడే" అన్నట్టుండేవారు. చుట్టుప్రక్కల పది వూళ్ళవరకూ ఏ ధర్మసందేహం వచ్చినా ఆయన తీర్చవలసిందే. మధ్యాహ్నంవేళ అభ్యాగతులు ఎవరు వచ్చినా అక్కడ దేవతార్చన (భోజనం) చెయ్యవలసిందే—

పండువంటి ఆయన జీవితంలో ఒకనాడు చుక్కతెగినట్టు దక్షిణాది బ్రాహ్మడొకడు ప్రవేశించాడు.

ఆయనది కుంభకోణ ప్రాంతం అయితే కావచ్చు. కుంభకోణం అంటే జ్ఞాపకం వచ్చేది అందరికీ ఒకటే.

పొట్టిగా చామనచాయగా వుండేవాడు, మీమాంసలో పండితుడని చెప్పుకునేవారు. మంచి సాహిత్యం వుండేది. పది పుస్తకాలూ, ఒక రైలు సంచీ ఆయన ఆస్తి—

ఎలా తెలుసుకున్నాడో దీక్షితులుగారి సంగతి తెలుసుకుని అక్కడికి వచ్చాడు! దీక్షితులుగారు సౌమ్యులు వారి వైదిక నిష్ఠను, ధార్మిక ప్రవృత్తినీ, ప్రశంసించి వారిని యథాలాపంగా చూడడానికి వచ్చినట్టు చెప్పాడు.

దీక్షితులుగారికి తెల్లనివి పాలు. నల్లనివి నీళ్ళు. "జీవిక వెదుక్కుంటూ ఎక్కడికో వెళ్ళడం ఎందుకూ? స్వీయానుష్ఠానం చేసుకుంటూ ఇక్కడే వుండిపొమ్మ"న్నారు ఆయన్ని —

దక్షిణాది శాస్త్రిులుగారు పరమ సంతోషంగా అక్కడే వుండిపోయారు.

దీక్షితులుగారు తాము ద్రావిడులు కనక—తమిళం మాట్లాడుతూ చనువుగా తిరిగే ఆయనను చూచి ఆత్మీయులుగా భావించారు. ఆయనకు తెలుగు రాదు. వీరికి తమిళం రాదు. ఉభయులకు సామాన్య భాష సంస్కృతం. దక్షిణాది ఆయన ఆడవాళ్ళతోకూడా ఏది కావలసి వచ్చినా సంస్కృతమే మాట్లాడేవాడు. దీక్షితులుగారు నవ్వుతూ తర్జుమాచేసి వారికి చెప్పి పనిజరిగేలా చూసేవారు.

పేరు తెలియక అంచరం దక్షిణాది శాస్త్రిులు అనే అనేవాళ్ళం. అప్పుడు నలుగురు విద్యార్థులం వుండేవాళ్ళం. అక్కడ ఆయనతో వచ్చీరాని సంస్కృతం మాట్లాడడం మాకో సరదా. ఆయన వీధిలో వెళ్ళుతూ వుంటే.

"భో, భో, శాస్త్రిణః! కుత్రగచ్ఛంతి ?" అని పలకరించేవాళ్ళం. ఆయన చిరునవ్వుతో "గచ్ఛథ" ఇత్యేవతు వక్తవ్యమ్" అని దిద్దుతూ

అంటాడు. మీరు అనేది కర్తగా వుంటే "గచ్ఛంతి" అనకూడదు. "గచ్ఛథ" అని మధ్యమ పురుషవాడా లని ఆయన దిద్దువాడు.

దీక్షితులుగారి మేనల్లుడు, నరసింహశాస్త్రిగారు సాహిత్యంలో వేదాంత శాస్త్రంలో మంచి పండితులు.

దీక్షితులుగారికి మేనల్లుడిమీద చాలా అభిమానం, తమకు సంతానం లేక వేరే దత్తత చేసుకున్నారు. దత్తపుత్రులుకూడా బహుసౌమ్యులు.

నరసింహశాస్త్రిగారిది ఆ వూరే. నాలుగిళ్ళవతల. మేనమామగారు పిలిస్తే వచ్చి నాలుగైదు రోజు లక్కడ వుండేవారు. దక్షిణాది శాస్త్రులుగారికి యెందుకో ఆయనమీద కసి ఏర్పడింది. ఊళ్లో ఇల్లూ వాకిలీ వుండగా ఇన్నాళ్లు ఇక్కడ ఎందుకని-దత్తపుత్రునితో భేదోపాయం నడిపి చూచారు. ఆయన వినిపించుకోలేదు. దీక్షితులుగారికి వ్యంగ్యంగా ఉద్బోధించడం ప్రారంభించాడు.

"అలుగుటయే యెరుంగని మహా మహితాత్ములు" దీక్షితులుగారు మందలించారు. పాకం ముదిరింది. శాస్త్రులు చెప్పకుండా హఠాత్తుగా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

చాల రోజులైంది. ఒకనాడు మిడిమిడి ఎండలో దక్షిణాదిశాస్త్రులు మా గురువుగారు వీరయ్య శాస్త్రిగారింటి కొచ్చాడు. దాహం అదీ పుచ్చుకుని ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. ఒక పావుగంట వుండి చప్పున లేచి వెడతా నన్నాడు. "ఎండగా వుంది, గొడుగు తీసుకువెళ్ళి మా శిష్యుడిచేత పంపం"డని గొడు గిచ్చి వెంట నన్ను పంపారు.

మూడు మైళ్ళు నడిచి గంగలకుర్రు వూరుచివర కొబ్బరితోటలో వున్న ఆయన ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు.

తలుపుతీసి లోపలికి వెళ్ళేసరికి ఒక దేవీవిగ్రహం, దాని యెదుట పూజ చేసిన కుంకుమరాశి! ఎదుట అఖండం వెలుగుతోంది.

దక్షిణాది శాస్త్రిలు ముఖం ఎత్తి జేవురించిన కళ్ళతో "దీక్షితులును సర్వనాశనం చెయ్యడానికి ఈ పూట - ఎప్పుడో వచ్చి ఆ ముసలివాడి తల పగలగొడతాను. కావలిస్తే వెళ్ళి చెప్పు" అన్నాడు. ఆయన మాటలకు వణికిపోయాను. గొడుగు తీసుకుని ఊరు చక్కా వచ్చాను.

ఈ సంగతి వారితో చెప్పడమా మానడమా? తోటి విద్యార్థితో చెబితే వెటకారంగా నవ్వి వూరుకోమన్నాడు.

తెల్లవారింది. కౌశికకు వెళ్ళే కొబ్బరితోటలో పెద్ద కోలాహలం!

పరుగెత్తి వెళ్ళి చూతుంగదా - జనం మూగివున్నారు. దీక్షితులు గారి తలమీద, గడ్డంమీద గాయాలనుంచి రక్తం కారుతోంది. పక్క మా గురువుగారు నిశ్చేష్టులై వున్నారు.

వృద్ధులు దీక్షితులుగారు అస్త్రల సహాయంతో ఇంటికి వెళ్ళారు.

శాస్త్రిలును వీధిమధ్య ఒక చెట్టుకు రెక్కలు విరిచికట్టారు. ఏమీ మాట్లాడడు. శిలువ వేసిన నేరస్థునిలా నిలిచివున్నాడు.

దీక్షితులుగారు 'అతని పాపానికి అతన్ని విడిచిపెట్టండి', అని కబురు చేశారు.

గురువుగారు అతని కట్లు విప్పించి, అన్నం పెట్టి పంపించివేశారు.

అతడు ఏ చీకటిలో కలిసిపోయాడో ఇప్పటికీ తెలియదు.